# దొంగలు - దొరలు

ఎల్. యన్. జయంతి

"ప్రఖ్యాత స్మగ్లర్ రాజ్ ఈరోజు ప్రభుత్వానికి లొంగి పోయాడు" రేడియో వార్తలలో యధాలాపంగా విన్నది అరుంధతమ్మ. అంతలోనే మామ్మగారూ మొన్న మీరు చూపెట్టిన రాజు మామయ్య ఫోటో లాంటిదే పేపర్లో పడిందంటూ ఇంటి వాళ్ళ మనుమడు ఆ రోజు పత్రిక అరుంధతమ్మకు చూపించాడు. అరుంధతమ్మ చదివింది. "ప్రభుత్వం కొద్ది రోజులుగా ఆచూకీ తీస్తున్న స్మగ్లర్ రాజ్ బొంబాయి పోలీసు కమీషనర్ ఆఫీసులో స్వయంగా లొంగిపోయాడు. అతనికి ప్రెసిడెన్సీ మెజిస్ట్రేట్ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు." ఆ ప్రక్కనే నాగరాజు ఫోటో వేశారు. అరుంధతమ్మ కుప్పలా కూలిపోయింది. గుండె ఆగి చనిపోయిందన్నారు డాక్టర్లు.

• • • •

'సహనావవతు...సహనౌభునక్తు ... సహవీర్యం కరవావహై'శాంతి మంత్రం శ్రావ్యంగా వస్తోంది పురోహితుడి నోట్లోంచి. రంగారావు దంపతులు తమ ముద్దుల కుమారుడికి నాగరాజు అని పేరు పెట్టారు. లేక లేక కలిగిన సంతానం అయినా సుబ్రహ్మణ్యస్వామి కలలో కనిపించేడు కనుక నాగరాజు అని నామకరణం చేశారు, మేధావి రంగారావు గారు చిన్నప్పట్నుంచి తెలివైన వాడుగా పరిగణింపబడి వృద్ధిలోకి వచ్చిన రంగారావుగారిని అందరు మేధావిగారనే వ్యవహరిస్తారు. ఆయన ఆ వూరి కాలేజిలో అధ్యాపకుడు. గత సంవత్సరం ప్రభుత్వం యిచ్చిన అప్పుతో కట్టిన యిల్లు ఆయన స్థిరాస్థి. భార్య అరుంధతి, కుమార్తెలు గిరిజ వనజ కాక, పున్నామ నరకంనుండి తండ్రిని రక్షించిన తనయుడిగా నాగరాజుని వెలలేని ఆస్థిగా చెప్పుకోవచ్చు జీవితంలోఅన్ని విధాలా అవుననిపించుకున్న మేధావి గారు- మేస్త్రి రామయ్య భార్య నరిసి అందాన్ని మాత్రం కాదన లేక పోయారు. ఆ తర్వాత మేస్త్రి కొడుక్కి కూడా నాగరాజని అయన సలహా మీదనే పేరెట్టారని వూళ్ళోవాళ్ళ అనుమానం.

కాల చక్రం గిఱ్ఱున తిరిగింది. ఈ మధ్యలో మేధావిగారు గుండె ఆగి చనిపోవడంతో, ముచ్చటగా కట్టుకున్నయిల్లు ప్రభుత్వం అప్పు కోసం, పిల్లల పెళ్ళిళ్ళకోసం చల్లగాచెయిజారింది. తండ్రి పండితుడైనా తాను పండిత పుత్రుణ్ణి కానంటూ మంచి మార్కులతో పరీక్షలు పాసయ్యాడు నాగరాజు. దీనికి సహాయ పడ్డవి అరుంధతి పట్టుదల, అప్పడాలు అమ్మి, కుట్టుపనిచేసి సంపాదించిన డబ్బు, నాగరాజు కార్యదీక్ష, ప్రభుత్వం వారి స్కాలరుషిప్పులు వగైరా, వగైరా, ఉద్యోగం కోసం ఊరూరు తిరుగుతున్నాడు నాగరాజు మూడు సంవత్సరాలుగా. అధికమైన అలసట, అనారోగ్యం లోకి దింపింది అరుంధతిని. అప్పటకి అయాచితంగా లభించిన ఆచారి మాష్టారి ఆదరణ, అయిదువేల అప్పు, ఆవిడకు మిగి

లాయి. తల్లిని సుఖపెడదామనే కొడుకు ఆశయమో, అబ్బాయి ఆనందం చూద్దామనే అమ్మ ఆశో, ఆవిడ ఆఖరి శ్వాసను నిలబెట్టాయి. సరిగ్గా అలాంటి సమయంలోనే అందాయి అరుంధతికి పదివేల రూపాయలకు డ్రాఫ్టు, నాగరాజు ఫొటో, వుత్తరం. "తనకు మంచి ఉద్యోగం అయిందనీ, యిప్పట్లో రావడానికి వీలు పడదనీ,అప్పుతీర్చి మిగిలిన సొమ్ము ఆచారి మాష్టారికి ఆమెపోషణార్థం యిమ్మనీ'' వ్రాసాడు నాగరాజు.

* * *

"అంతలోనే ఇంత దారుణమా అనుకున్నా, ఇంక తన ఆలోచనకు తల, తోక దొరక్క అరుంధతి శవానికి అగ్ని సంస్కారానికి ఏర్పాటు చేసారు ఆచారి గారు.

ఆతలా, తోకాయివి. ఊళ్ళుతిరిగి, చెప్పలరిగి, అలిసిపోయినా పట్టభద్రుడైన నాగరాజుకు ఉద్యోగం,భద్రత దొరకలేదు. విసిగివేసారి ఒక వేపచెట్టుక్రింద అలసట తీర్చుకుంటున్న అతని ప్రక్కన పడవ లాంటి కారు ఆగింది. కారు కంటే కన్నుచెదిర్చే అందంగల కాత్యాయిని కాసేపు నాగరాజుని కళ్ళార్పకుండా చూసింది. వెంటనే కళ్ళు అర నిముషం మూసి మెదడుకి పనిచెప్పింది. ఆ ఆలోచన ఫలితమే నాగరాజుకి, అంత అందమైన అమ్మాయి ప్రక్కన కూర్చుని అడ్రసు తెలియని చోటికి తీసుకు వెళ్ళింది

వాళ్ళు వెళ్ళిన యింటి యజమాని రాజ్ మిస్త్రి. మేస్త్రి రామయ్య కొడుకు. తండ్రి సిమెంటు, ఇసుక ఎంత సమంగా పాళ్లువేశాడో తెలియదు కాని, కొడుకు నాగరాజు అంతకంటే కాంక్రీట్‌గా స్మగులింగు బిజినెస్ నడపగలిగాడు. ఆ విషయంలో కాల్ గర్ల్ కాత్యాయని సహాయం పూర్తిగా వుంది. లక్షలు లక్షలు గడించాడు, స్మగులింగ్ మానేసి, లక్షణంగా పెళ్ళి చేసుకుని జీవితంలో స్థిరపడుదామనే ఆలోచన వచ్చేప్పటికే, చూసీ చూడనట్లున్న ప్రభుత్వం ఒక్కసారి కళ్లు తెరవడం నలుగురైదుగురు స్మగ్లర్స్ లొంగిపోవడం, ఒక వారం రోజుల్లో జరిగిపోయాయి. తకకింక రెండు మూడు రోజులకంటే టైము వుండదని సన్నిహితుడైన ఒక పెద్ద ఆఫీసరు లోపాయికారీగా తెలియచేశాడు. కాని అదృష్టం అందలం ఎక్కిస్తుంటే ఎవరాపగలరు. మేధావిగారి పోలికలు నాగరాజులిద్దర్లోను కొట్టవచ్చినట్లు కనపడ్డంవల్ల పని సులభముయింది.

జీవితం మీద విరక్తి పెంచుకున్న నిరుద్యోగికి కాత్యాయని కార్యక్రమం వివరించింది. విధంచెడ్డా ఫలం దక్కుతుంది అనుకున్నాడు నిరుద్యోగి. వెంటనే కాత్యాయని యిచ్చిన డబ్బు 10 వేలు తల్లి(కి) ఋణ విముక్తికి పంపించాడు. తను జీవితాంతం నిశ్చింతగా గడుపుదామని తానే రాజ్ నంటూ కారాగారానికి పోయాడు.

కొన్ని రోజుల తర్వాత కాంతం రాజ్ మిస్త్రీల వివాహం వైభవోపేతంగా జరిగింది. ''శతం జీవే మాచరాజో''... ఆశీర్వచనం చెప్తున్నాడు పురోహితుడు. రాష్ట్ర గవర్నరు తదితర ప్రముఖులు, ఉద్యోగులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.